సాక్షి నిర్మల్

మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



ఢిల్లీ మెచ్చిన పంచాయతీ 10లో▸

ముఖరా(కె) పంచాయతీ ఓడీఎఫ్ ప్లస్‌గా జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. మార్చి 4న రాష్ట్రపతి చేతుల మీదుగా సర్పంచ్ మీనాక్షి అవార్డు అందుకోనున్నారు.



ప్రీతి మృతిపై విచారణ జరిపించాలి

పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి మృతిపై విచారణ జరిపించాలని బాధ్యుడైన సీనియర్ సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని జిల్లావాసులు డిమాండ్ చేశారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.8 /19.5

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎడ తీవ్రత మధ్యాహ్నం అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. చలి ప్రభావం తగ్గుతుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

చినజీయర్‌స్వామి ప్రశంస



ప్రశంసాపత్రం అందిస్తున్న చినజీయర్ స్వామి

కుంటాల: మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన జెడ్పీటీసీ కొత్తపల్లి గంగమణి–బుచ్చన్న దంపతుల కుమారుడు డాక్టర్ సుజ్ఞాన్ ఇటీవల ఎండీ పీజీ ఎంట్రన్స్‌లో జాతీయస్థాయిలో 52వ ర్యాంకు సాధించాడు. తెలంగాణ టాపర్‌గా నిలిచాడు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి కోల్‌కతాలో సీటు సాధించాడు. సుజ్ఞాన్‌ను జీయర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(జిమ్స్) కాలేజ్ చైర్మన్ జూపల్లి రామేశ్వర్ ఆధ్వర్యంలో ఇటీవల సన్మానించారు. చినజీయర్‌స్వామి సుజ్ఞాన్‌కు ప్రశంసాపత్రం అందించి అభినందించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు తనిఖీలు



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్/లక్ష్మణచాంద: శాంతి భద్రత పరిరక్షణ కోసమే తనిఖీలు నిర్వహిస్తున్నామని డీఎస్పీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో, సోన్ మండలంలోని జాఫ్రాపూర్‌లో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. జాఫ్రాపూర్‌లో 100 ద్విచక్రవాహనాల, 2 ఆటోలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు శాంతి భద్రతలపై ధైర్యం కల్పించేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. నంబర్ ప్లేట్ తప్పుగా రాయడం, వంచడం లాంటివి చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తెలిపారు. వాహనాలు నడుపుతూ మైనర్లు పట్టుపడితే తండ్రిపై కేసు నమోదు చేస్తామన్నారు. నిత్యం మనకు ఏదో నంబర్ నుంచి ఫోన్ వచ్చి మీకు అన్ని రూపాయలు, ఇన్ని రూపాయల లాటరీ వచ్చిందని మీ బ్యాంక్ వివరాలు తెలుపాలని చాలా మంది సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అటువంటి ఫోన్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తనిఖీల్లో పట్టణ సీఐ మల్లేశ్, ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, సోన్ ఎస్సై రవీందర్,లక్ష్మణచాంద ఎస్సై రాహుల్ గైక్వాడ్, మామడ ఎస్సై అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

నిర్మల్ రూరల్: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ జీవన్‌రెడ్డి సూచించారు. మండలంలోని వెంగ్వపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. నేరస్తులను త్వరగా పట్టుకోవడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగయ్య, గ్రామస్తులు సాదా సుదర్శన్, విజయ్, చంద్రగౌడ్, వీడీసీ నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో ఖానాపూర్ విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థినులు

ఖానాపూర్: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని టీఎస్‌జీవోస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో మండలంలోని బాదన్‌కుర్తి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన బి.మోక్ష కటాస్ విభాగంలో బంగారు పతకం సాధించింది. ఎ.వర్షిణి, కె.జ్ఞానేశ్వరి స్పైరింగ్ విభాగంలో వెండి పతకాలు సాధించారు. జి.నవ్య కటాస్ విభాగంలో బంగారు పతకం గెలుచుకుంది. పట్టణంలోని ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలకు చెందిన మానస కటాస్ విభాగంలో బంగారు పతకం, కృష్ణవేణి హైస్కూల్‌కు చెందిన అవర్గ మనీష వెండి పతకం, లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థిని వేల్పుల యజ్ఞశ్రీ స్పైరింగ్ విభాగంలో వెండి పతకం సాధించారు. విజేతలను శిక్షకులు వెల్డి కిషన్, వి.నాగలక్ష్మి అభినందించారు.

పెద్దలకు జ్వరం.. పిల్లలకు జలుబు



నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులు

- జిల్లాలో ప్రబలుతున్న విష జ్వరాలు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- జలుబు, దగ్గుతో తీవ్ర ఇబ్బందులు
- మంచం పడుతున్న చిన్నారులు
- జిల్లా ఆసుపత్రిలో సరిపోని పడకలు
- ఒక్కో బెడ్‌పై ఇద్దరికి చికిత్స



చిన్నారిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: సీజనల్ ఇన్‌ఫెక్షన్లు, వైరల్ ఫీవర్స్ జిల్లాలో విజృంభిస్తున్నాయి. పిల్లలు, పెద్దలను పీడిస్తున్నాయి. ఒక ప్రాంతం, ఒక ఊరు, ఒక మండలం అ ని తేడా లేకుండా జిల్లా అంతటా చిన్నారులు జలు బు, దగ్గుతో, పెద్దలు జ్వరాలతో బాధపడుతున్నా రు. ఏ ఇంట్లో చూసినా.. ఎవరో ఒకరు జ్వరం, గొంతు నొప్పి, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో తల్లడిల్లుతున్నారు. బాధితులు జిల్లా ఆసుపత్రితోపాటు భైంసా ఏరియా ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. బాధ ఎక్కువగా ఉన్నవారు ఆస్పత్రుల్లో అడ్మిట్ అవుతున్నారు. పిల్లలు, వృద్ధులు చికిత్స తర్వాత కూడా కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతోంది. గతంలో వచ్చిన సీజనల్ వ్యాధులకు ప్రస్తుత సీజనల్ వ్యాధులకు బాగా తేడా ఉంది. ప్రస్తుతం విషజ్వరాలతోపాటు దగ్గు, జలుబు ప్రభావం ఎక్కువగా ఉంది. వ్యాధులు ముసురుకుంటుండడంతో ప్రైవేటు ఆస్పత్రులు ఇదే అదునుగా ఫీజులు, టెస్టుల పేరుతో దండుకుంటున్నాయి.

వాతావరణంలో మార్పులతో...

వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు విరుచుకుపడుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. పొద్దంతా ఎండ, రాత్రయితే చలి ప్రభావం ఉండడంతో దగ్గు, జలుబు జ్వరాలు విజృంభిస్తున్నాయని చెబుతున్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో రోజువారీ 600 ఉండగా, ప్రస్తుత సీజన్‌లో రోజువారీ ఓపీ 900గా నమోదవుతోంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో వెయ్యికి పైగా ఓపీ ఉంటుంది. ఇందులో 70 శాతం జ్వర పీడితులేనని వైద్యులు చెబుతున్నారు.

200 దాటిన పిల్లల ఓపీ..

పిల్లల్లో కూడా జ్వర బాధితులు పెరుగుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి పిల్లల వార్డులో బెడ్‌లు నిండిపోయాయి. మామూలు రోజుల్లో 120 మంది వరకు వచ్చే చిన్నారుల ఓపీ ప్రస్తుతం 200 దాటుతోంది. ఇందులో ఎక్కువగా జ్వరం, వాంతుల బారిన పడిన చిన్నారులే అధికంగా వస్తున్నారు. పిల్లలకు జ్వరం తగ్గినట్టే తగ్గి రెండు వారాల తర్వాత మళ్లీ వస్తోంది.

జిల్లా ఆస్పత్రిలో వారం రోజులుగా నమోదైన ఓపీ వివరాలు

తేదీ	సంఖ్య
20	867
21	749
22	583
23	642
24	671
25	709
27	882

'వైరల్' వర్రీ..!



ఓపీ వద్ద రోగులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రి

భైంసాటౌన్: భైంసా ఏరియాస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. కొన్ని రోజులుగా జ్వర లక్షణాలతో ఆస్పత్రి పాలవుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. సోమవారం ఒక్కరోజే 500లకుపైగా ఓపీ నమోదైంది. వీరిలో ఎక్కువగా జ లుబు, ఒంటినొప్పులు, జ్వర లక్షణాలతో బా ధపడుతున్న వారే ఉంటున్నట్లు వైద్యులు పే ర్కొంటున్నారు. వాతావరణంలో మార్పుల కా రణంగా జలుబు, తీవ్రమైన ఒం టి నొప్పులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తున్నట్లు తెలిపారు.

జిల్లా ఆసుపత్రిలో బెడ్ల కొరత..

ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో ఇన్ పేషెంట్ల సంఖ్య వారం రోజులుగా విపరీతంగా పెరిగింది. దీంతో జిల్లా ఆస్పత్రిలో బెడ్లు ఖాళీగా లేక ఒకే పడకపై ఇద్దరు, ముగ్గురికి ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన కొంతమంది రోగుల తాకిడి తట్టుకోలేక ఉదయం సాయంత్రం వచ్చి ట్రీట్మెంట్ తీసుకుంటూ ఇంటికి వెళ్తున్నారు.

వైద్యులను సంప్రదించాలి...



వాతావరణంలో మార్పుల కారణంగా చిన్నపిల్లలు ప్రస్తుతం జ్వరం, దగ్గు, జలుబు, డయేరియాతో బాధపడుతున్నారు. ఇందులో ఎటువంటి సమస్య అయిన పిల్లలకు ఎదురైతే సమీపంలోని పిల్లల వైద్యున్ని సంప్రదించాలి. పిల్లలకు చల్లటి నీటిని కాకుండా కాచి చల్లార్చిన నీటినే తాగించాలి.

– డాక్టర్ స్వప్న, చిన్నపిల్లల వైద్యురాలు

రెండు రోజులుగా చలి జ్వరం...



నేను మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో చదువుతున్నాను. రెండు రోజుల నుంచి చలి జ్వరం, వాంతులు అవుతున్నాయి. మా నాన్న జిల్లా ఆస్పత్రిలో పరీక్షలు చేయించగా వైద్యులు వైరల్ ఫీవర్ అని చెప్పారు. ప్రస్తుతం చికిత్స నడుస్తుంది. జ్వరం తగ్గింది.

– హమ్మస్, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి,

బెడ్ల కొరత ఉంది...



రెండు రోజుల క్రి తం తీవ్రమైన జ్వ రంతో ఆసుపత్రిలో చేరాను. బెడ్ల కొరత కారణంగా ఒకే మంచంపై ఇద్దరికి చికి త్స అందజేస్తున్నారు. కూర్చునే సెలైన్ పె ట్టుకోవాల్సి వస్తోంది. అదనపు పడకలు ఏ ర్పాటు చేయాలి. మెరుగైన వైద్యం అందించాలి.

– సాయన్న, కనకపూర్

గుంపులుగా ఉండే ప్రదేశాలకు వెళ్లొద్దు..

వైరల్ జ్వరాలు అనేవి గాలి, చల్లటి నీటి ద్వారా వ్యాపిస్తాయి. జనాలు గుంపులుగా ఉండే ప్రదేశాలకు వెళ్లకపోవడం మంచిది. గుంపులో ఏ ఒక్కరికి వైరల్ ఫీవర్ ఉన్నా మరొకరికి వ్యాపించే అవకాశం ఉంటుంది. సాధ్యమైనంత వరకు కాచి చల్లార్చిన నీరు తాగాలి. ఆహార పదార్థాలు కూడా వేడిగా ఉన్నప్పుడే తినాలి.

– డాక్టర్ రత్నాకర్, జనరల్ ఫిజీషియన్

ఇన్‌స్పైర్ మేళాకు 119 ప్రాజెక్టులు



ఇన్‌స్పైర్‌మానక్‌లో ప్రాజెక్ట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు(ఫైల్)

- జిల్లా నుంచి ఎంపిక
- ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేలు
- డిసెంబర్‌లో జాతీయ ప్రదర్శన

మామడ: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచడం, నూతన ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించేందుకు జాతీయస్థాయిలో ఇన్‌స్పైర్ మేళా (innovation in science pursuit for inspired reaserch) మేళా అవకాశం కల్పిస్తుంది. విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించేలా ప్రభుత్వమే ఏటా ఈ మేళా నిర్వహిస్తోంది.

1,224 నామినేషన్‌లు...

ఈ ఏడాది ఇన్‌స్పైర్ మేళాకు జిల్లా నుంచి 1,224 నామినేషన్లు పంపించారు. అత్యధిక నామినేషన్లు పంపిన జిల్లాల్లో నిర్మల్ రాష్ట్రంలో రెండోస్థానంలో ఉంది. ఈ నామినేషన్లను పరిశీలించి 119 ప్రాజెక్టులను ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన ప్రాజెక్టులను ఈ యేడాది డిసెంబర్‌లో నిర్వహించే మేళాలో విద్యార్థులు ప్రదర్శిస్తారు. ఇన్‌స్పైర్ మేళాకు ఎంపికైన ఒక్కో ప్రాజెక్టుకు రూ.10 వేల చొప్పున విద్యార్థి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. డిసెంబర్‌లో నిర్వహించే మేళాలో ప్రదర్శించే ప్రాజెక్టు తయారీకి ఈ డబ్బులను గైడ్ టీచర్ సహకారంతో విద్యార్థి వినియోగించాల్సి ఉంటుంది. జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మేళాకు జిల్లా నుంచి 119 ప్రాజెక్టులు ఎంపిక కాగా, ఇందుకోసం రూ.11.90 లక్షలు విద్యార్థుల ఖాతాలో జమ చేయనున్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు జూనియర్ విభాగం, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్ విభాగంలో ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. జిల్లాలోని ప్రభుత్వ, కేజీబీవీ, స్థానిక సంస్థలు, ఆశ్రమ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్‌లు ప్రదర్శించే అవకాశం ఉంటుంది.

ప్రదర్శించే అంశాలు..

1. పర్యావరణం స్నేహపూర్వక పదార్థం
వాతావరణంలో వస్తున్న మార్పులను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన అంశాలను ప్రదర్శించవచ్చు.
2.ఆరోగ్యం పరిశుభ్రత
ఆరోగ్యం, పోషక అవసరాలను ప్రభావితం చేసే అంశాలపై అవగాహన కల్పించడం, కోవిడ్–19 లాంటి విపత్తులు ఎదుర్కొనేందుకు నూతన సాంకేతికను వినియోగించడం, వినూత్న ఆలోచనలు చేయడం.
3. సమాచారం, కమ్యూనికేషన్ టెక్నాలజీ పురోగతి
- సమాచారం రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా టెక్నాలజీని వినియోగించడం.

4.రవాణ రంగంలో టెక్నాలజీ రోడ్డు, రైలు ప్రమాదాలు తగ్గించే మోడల్స్ ప్రదర్శించాలి.
5. పర్యావరణం సుస్థిర మార్పులు
- వాతావరణంలో వచ్చే మార్పులు, భూభ్రమణం, భూపరిభ్రమణం అంశాల ఆధారంగా ప్రదర్శనలు చేయవచ్చు.

6. ఆవిష్కరణలతో చారిత్రక అభివృద్ధి
- నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా జరిగే అభివృద్ధి సంబంధించి ప్రాజెక్టులు ప్రదర్శించవచ్చు.

7. మ్యాథమెటికల్ మోడలింగ్, నిత్యజీవితంలో గణితం పాత్రను వివరించాలి.
డాటా నిర్వహణ, సమాచారం విశ్లేషించడం, యుద్ధం ద్వారా వచ్చే వినాశక పరిస్థితులు అంచనా వేయడం వంటివి గణిత మోడలింగ్ ద్వారా వివరించవచ్చు.

వినూత్న ఆలోచనలకు అవకాశం



జిల్లాలో ఇన్‌స్పైర్ మానక్ అవార్డుల కోసం 1,224 నామినేషన్లు పంపించగా 119 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ప్రదర్శన అనంతరం, ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపించడం జరుగుతుంది. ఇన్‌స్పైర్ మేళా ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం ఉంది. వినూత్నమైన ఆలోచనలతో ప్రాజెక్టులు రూపొందించే విద్యార్థులకు అవకాశం లభిస్తుంది.

– వినోద్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి

శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం



ఇన్‌స్పైర్‌మానక్ అవార్డులకు ఎంపికైన విద్యార్థులు ఎంపిక చేసుకున్న నూతన ప్రాజెక్టులు ప్రదర్శించేందుకు మంచి అవకాశం లభిస్తుంది. పాఠశాలస్థాయి నుంచి సైన్స్, ఆవిష్కరణలపై ఆసక్తి పెంచుకుంటే భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుంది. గైడ్ టీచర్లు ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలి. సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు తయారు చేయించాలి.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

గోడు విన్నారు.. గోస తీర్చండి

- ప్రజావాణికి స్వల్పంగా పెరిగిన వినతులు
- కొత్త కలెక్టర్ రాకతో పెరుగుతున్న అర్జీదారులు
- సమస్యలకు సత్వర పరిష్కారంపై పెరుగుతున్న నమ్మకం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో చాలా రోజుల తర్వాత ప్రజావాణిలో సోమవారం కాస్త రద్దీ కనిపించింది. గతంలో వారం వరకు కేవలం 15 లోపే వచ్చిన అర్జీలు ఈవారం 27 వచ్చాయి. రెండు వారాలుగా ప్రజావాణిలో కలెక్టర్ స్వయంగా పాల్గొంటుండడంతో ప్రజలకు తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం పెరుగుతోంది. దీంతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. క్యూలో నిలబడి కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబును స్వయంగా కలిసి అర్జీ సమర్పించి తమ గోడు వెల్లబోసుకున్నారు. గోస తీర్చాలని వేడుకున్నారు. బాధితుల సమస్యలు ఓపికగా విన్న కలెక్టర్ కూడా పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందించి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో లోకేశ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చెవిటి వారికి ప్రత్యేక శిబిరం నిర్వహించాలి..

చెవిటి, మూగ వారికోసం ప్రత్యేక సదరం శిబిరం నిర్వహించాలని డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ జిల్లా అధ్యక్షుడు సాయినాథ్ కరారు. ఈమేరకు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. చెవిటి, మూగవారు 100% వైకల్యం కలిగి ఉంటారని, సదరం క్యాంపులో మాత్రం 75% మాత్రమే ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఇస్తున్నారని తెలిపారు. దీంతో పెన్షన్లు, రాయితీలు పొందలేకపోతున్నామన్నారు.

సదరం సర్టిఫికెట్ ఇవ్వండి..



నాది జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ నగర్ కాలనీ. పుట్టు మూగవాడిని, నాకు మాటలు రావు. వికలాంగ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే సదరం సర్టిఫికెట్ అడుగుతున్నారు. నాకు సదరం సర్టిఫికెట్ ఇప్పించండి.

– సయ్యద్ అక్బర్, వైఎస్సార్ కాలనీ, నిర్మల్

ధరణిలో పేరు తొలగించాలి



నేను 2015లో తిమ్మాపూర్ రెవెన్యూ గ్రామానికి చెందిన రాజేశ్వర్ నుంచి 2.15 గుంటల భూమిని కొనుగోలు చేశాను. రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ ధరణిలో నాపేరు నమోదు కాలేదు. రాజేశ్వర్ పేరిటనే పాస్ పుస్తకం ఇచ్చారు. విచారణ జరిపి ధరణిలో రాజేశ్వర్ పేరు తొలగించాలి.

– సందీప్‌రెడ్డి, తర్లపాడు

పెంచిన వేతనం అమలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెంచిన వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేశ్ కోరారు. పెండింగ్ బిల్లులు, జీతాలు విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి డీఈవో కార్యాలయం, కలెక్టరేట్‌లో సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలు ఇచ్చారు. అనంతరం సురేశ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన నాలు గు నెలల బిల్లులు, పెంచిన వేతనాలు విడుదల చేయాలని కోరారు. ధరలు ఆకాశన్నంటుతున్న తరుణంలో కార్మికులు మధ్యాహ్నం భోజనం తయారీకి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ధరలు విపరీ తంగా పెరిగినా మెనూ చార్జీలు పెంచడంలేదన్నారు. సబ్సిడీపై గ్యాస్ సరఫరా లేదన్నారు. ఇచ్చే కొద్దిపాటి మెనూ చార్జీలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని వివరించారు. పెరిగిన ధరలతో పోల్చితే ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ సరిపోదని 1 నుంచి 5వ తరగతి పిల్లవాడికి రూ.1.97, 6 నుంచి 10 తరగతుల పిల్లవాడికి రూ.7.45 ఇస్తున్నారని, దీనిని రూ.15కు పెంచాలని కోరారు. కోడి గుడ్డుకు అదనంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. లేదంటే అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లుగా పాఠశాలలకు కూడా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీనెల యూనియన్ డీఈఓ జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు నియామక పత్రాలు, గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. వినతిపత్రాలు ఇచ్చినవారిలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి కె.రాధ, ఉపాధ్యక్షులు చీకటి లక్ష్మి, సత్తవ్వ, విమల, లక్ష్మి, పద్మ జిల్లా సహాయ కార్యదర్శి రవీంద్ర, లత పాల్గొన్నారు.

పెరిగిన కరువు భత్యం అమలు చేయాలి



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం(వీడీఏ) అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీ యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాజన్న కోరారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీడీ పరిశ్రమల్లో పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులకు కరువు భత్యం వినిమయ ధరల సూచి 1,602 నుంచి 1,696 పాయింట్లకి పెరిగిందన్నారు. 1994 అగ్రిమెంట్ ప్రకారం పాయింట్‌కు పది పైసలు చొప్పున రూ. 9.40 పెరిగిందని తెలిపారు. ఈ పెరుగుదల 2023, ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. బీడీలు చుట్టే కార్మికులకు 1000 బీడీలకు కరువు భత్యం రూ.9.40 పెంచి ఏప్రిల్ నుంచి అమలు చేయాలన్నారు. నెలసరి జీతాల ఉద్యోగులైన బీడీ సర్టర్, ఆకు, తంబాకు పంచేవారు, గుమస్తాలకు, అకౌంటెంట్లకు, బట్టి వాలా, చెన్నివాలా, గంపవాలా, వాచ్ మెన్‌లకు నెలకు రూ.282 చొప్పున పెంచాలన్నారు. దీంతో రాష్ట్రంలోని ఏడు లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సమావేశంలో బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆర్.రామలక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, కోశాధికారి ఎండీ.గఫూర్, జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మి పాల్గొన్నారు.

'హక్కుల కోసం పోరాడుదాం'

భైంసాటౌన్: బీడీ కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. భైంసా పట్టణంలోని కేఎస్ గార్డెన్స్‌లో జిల్లా ఏడో మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ఎం.హరిత, ప్రధాన కార్యదర్శిగా సునారికారి రాజేశ్, ఉపాధ్యక్షులు గా ఎస్.వెంకటేశ్, విలాస్, సహాయ కార్యదర్శి గా అంకం గంగాధర్, దుర్గం లింగన్న, కోశాధికారిగా సుబ్బలక్ష్మి, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం బీడీ కార్మికులకు ఆంక్షలు లేని జీవనభృతి, 26 పనిదినాలు, జీవో 41 అమలు, నా ణ్యమైన ఆకు, తంబాకు సరఫరా, కోప్టా చట్టం రద్దు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన 'మీలో ఎవరు లక్షాధికారి' విజేతలు



కలెక్టర్ ను కలిసిన విద్యార్థులు

నిర్మల్ రూరల్: నిర్మల్‌కు చెందిన తన్నూరు వెంకట్‌రావు నిర్వహించిన 'మీలో ఎవరు లక్షాధికారి' క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు క్విజ్ పోటీల వెంకట్రావుతో కలిసి డీఈవో రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కలిశారు. డీఈవో క్విజ్ నిర్వహించిన తీరును కలెక్టర్‌కు వివరించారు. 74 ఉన్నత పాఠశాలల నుంచి 415 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. వీరికి మూడుసార్లు రాత పరీక్ష నిర్వహించి వడపోత చేయగా 14 పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు గెలుపొందారని పేర్కొన్నారు. మస్కాపూర్ పాఠశాలకు చెందిన సిద్ధార్థ అనే విద్యార్థి మొదటి స్థానంలో నిలిచి రూ.లక్ష నగదు బహుమతి, పోస్కల్ జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థి రెండోస్థానంలో నిలిచి రూ.50 వేలు, లింగాపూర్ పాఠశాల విద్యార్థిని సౌజన్య రూ.30 వేల నగదు గెలుచుకున్నట్లు వివరించారు. క్విజ్ పోటీల నిర్వాహకుడిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిమాణం అన్నారు. విద్యార్థులు మరింత కష్టపడి జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్‌ను కలిసినవారిలో సెక్టోరియల్ అధికారి నాగుల రవి, కా ర్యక్రమ నిర్వాహకులు వెంకట్రావు దంపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేషనల్ యూత్ జూడో పోటీల్లో పతకాలు



మెడల్స్‌తో లక్ష్మణ్, డెంజిల్

ఆదిలాబాద్‌అర్బన్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈనెల 10న జరిగిన ఖేలో ఇండియా నేషనల్ యూత్ జూడో పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించారు. జిల్లాకేంద్రంలోని విద్యార్థి కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న లోడంగే లక్ష్మణ్ గోల్డ్ మెడల్, డెంజిల్ అనే విద్యార్థి బ్రౌన్జ్ మెడల్ సాధించారు. సోమవారం జిల్లాకు వచ్చిన వారిని కళాశాల యాజమాన్యం శాలువతో సత్కరించింది. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, స్పోర్ట్స్ కోచ్ రాజు, కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డి, లెక్చరర్ శ్రీకాంత్‌రెడ్డిలు వారికి అభినందనలు తెలిపారు.

శనగ నూర్పిడి యంత్రంలో పడి ఒకరి మృతి



యంత్రంలో మృతిచెందిన దినేశ్

తానూరు: శనగలు పడుతుండగా ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రంలో పడి ఒకరు మృతిచెందారు. ఈ విషాద ఘటన మండలంలోని ఖర్బలా గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం శివపూరి జిల్లా వాగర్‌వాడకు చెందిన కొందరు ఉపాధి కోసం శనగ నూర్పిడి యంత్రంతో వచ్చి ఖర్బలా గ్రామంలో ఉంటున్నారు. ఓ రైతు పొలంలో శనగ నూర్పిడి చేస్తుండగా దినేశ్ (26) అనే కూలీ ప్రమాదవశాత్తు యంత్రంలో పడి చుట్టుకుపోయాడు. అతని శరీరం తల, మొండం వేరుగా విడిపోయాయి. ఈ విషయాన్ని యజమానులు, రైతులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి శరీర భాగాలను పోస్టుమార్టం నిమిత్తం సోమవారం భైంసా ఆస్పత్రికి తరలించారు. బాధిత కూలీల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో ఇద్దరు..





రాఘువులు (ఫైల్) లక్ష్మణ్ (ఫైల్)

ముధోల్: మండలంలోని చించాల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యవసాయ కూలీలు ఒకేరోజు గుండెపోటుతో మృతిచెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. వరగంటి లక్ష్మణ్(33) ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో గ్రామస్తులతోపాటు కండెల రాఘువులు (42) అక్కడికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చిన రాఘువులు రాత్రి 12 గంటల ప్రాంతంలో గుండెపోటుకు గురయ్యాడు. బంధువులు వెంటనే భైంసాలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఒకేరోజు ఇద్దరు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఒకరి రిమాండ్

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామానికి చెందిన గన్నారం లక్ష్మణ్‌కు చెందిన బెల్టు షాపులో ఆదివారం రాత్రి రూ.2 వేలు దొంగిలించిన అదే గ్రామానికి చెందిన నిందితుడు తోకల చిన్న సాయిలును సోమవారం పోలీసులు పట్టుకున్నారు. నిర్మల్ జూనియర్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అజయ్ ఎదుట హాజరుపర్చగా నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై పాకాల గీత పేర్కొన్నారు.

సీసీఐ పునరుద్ధరణకు ఉద్యమించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.వీరయ్య



భూములు పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. వీరయ్య, నాయకులు

ఎదులాపురం: సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పునరుద్ధరణకు జిల్లా ప్రజలు ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.వీరయ్య పిలుపునిచ్చారు. సీపీఎం కార్యకర్తల ప్లీనరీలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన సీసీఐ పరిశ్రమకు సంబంధించిన భూములను పార్టీ ప్రతినిధి బృందం, సీసీఐ సాధన కమిటీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీఐ పరిశ్రమ జిల్లాకే తలమాణికంగా నిలుస్తోందన్నారు. పరిశ్రమ తిరిగి ప్రారంభమైతే జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. సీసీఐకి సంబంధించి ప్రభుత్వ భూమి 800 ఎకరాలు, లీజు భూమి 1200 ఎకరాలు ఉండగా నేడు కాజేయాలని భూ బకాసురులు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. మరోవైపు భూముల్లో అక్రమంగా లేఅవుట్లు వేస్తున్నారని తెలిపారు. సీసీఐ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం మొద్దు నిద్ర పోవడంపై మండిపడ్డారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా ప్రజాప్రతినిధులు, సీసీఐ అధికారులు, కలెక్టర్ చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. అనంతరం ప్లీనరీలో మాట్లాడారు. పారిశ్రామికీకరణ అనంతరం ప్రతి దశాబ్ద కాలానికి ఆర్థిక మాంద్యం బుసలు కొడుతుందని, ఇది భవిష్యత్ సంక్షోభానికి హెచ్చరిక లాంటిదన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, నాయకులు దత్తాత్రి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాఘవులు, కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆశన్న, గంగన్న, రైతు సంఘం నాయకులు పోశెట్టి, వెంకన్న, కేవీపీఎస్ నాయకులు స్వామి, భూనిర్వాసితుల సంఘం నాయకులు అరవింద్, ఈశ్వర్‌దాస్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి

- ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ

ఆదిలాబాద్‌రూరల్: గతంలో ఆదిలాబాద్ అంటే ఆదివాసీల జిల్లా అని పేరు విన్నా, ప్రస్తుతం అదే జిల్లాలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్‌గా కొనసాగుతున్నానని ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ అన్నారు. జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనం ఆవరణలో ఆదివాసీ తొమ్మిది తెగల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన హీరాసుక జయంతి వేడుకలకు ఆమె హాజరయ్యారు. అనంతరం ఆదివాసీల సంప్రదాయ బద్ధంగా నిర్వహించిన పూజలో ఆమె పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. వీటిని రాబోయే తరాలకు అందించేలా నేతలు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఆదివాసీ తెగల్లో ఉన్నత స్థాయిలో రాణించిన వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆదివాసీ సంఘాల నేతలు మాట్లాడుతూ పాలకులు ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటున్నారు కాని తమకు ఇంటి స్థలాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎలాంటి తీర్మానాలు, షరతులు లేకుండా పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్‌కు అందజేశారు. ఆదివాసీ సంఘాల నాయకులు పూసం ఆనంద్‌రావ్, ఆత్రం అనుసూయ, కుర్సేంగే తానాజీ, సిడాం రాం కిషన్, గేడం ఆనంద్‌రావ్, పుస్నాక్ భాస్కర్, మడావి శంకర్, మెస్రం మనోహర్, మెస్రం శంకర్, వైస్ ఎంపీపీ జంగు, గేడం తులసీరాం, కుద్మేత ప్రకాశ్, మెస్రం నగేశ్, ప్రభాకర్, మహిళా నాయకురాలు గోడం రేణుక, ఉయికే ఇంద్ర, మీనా పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- ఆదివాసీల డిమాండ్



గుడిసెలు వేసుకున్న ఆదివాసీలు

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలతోపాటు డబుల్ బెడ్రూం కేటాయించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 72లోని 20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆదివాసీ గిరిజనులు సోమవారం ఆక్రమించి గుడిసెలు వేసుకున్నారు. ఆదిలాబాద్‌లోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనంలో హీరాసుక జయంతి వేడుకల్లో పాల్గొన్నవారు అక్కడికి చేరుకుని గుడిసెలు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ మాట్లాడారు. 2007లో 72 సర్వే నంబర్‌లో 1,400 మంది గుడిసెలు వేసుకుంటే అప్పటి అధికారులు 2013లో తొలగించారన్నారు. అక్కడి నుంచి వెళ్లిన వారు పట్టణంలోని అద్దె ఇళ్లలో ఉండి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రియల్ వ్యాపారులు మాత్రం ప్రభుత్వ భూములు కబ్జా చేస్తుంటే కూలీ పనులు చేసుకుంటున్న ఆదివాసీలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించడం లేదన్నారు. ఆదివాసీలు గుడిసెలు వేసుకున్నారని విషయం తెలుసుకున్న ఆర్‌ఐ హన్మంత్‌రావ్ అక్కడికి చేరుకున్నారు. వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. ఇంటి స్థలాలు కేటాయించే వరకు సర్వే నంబర్ 72 నుంచి కదిలే ప్రసక్తే లేదన్నారు. చేసేదేమీ లేక ఆర్‌ఐ ఉన్నతాధికారులకు విషయాన్ని వివరించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



క్షతగాత్రుడిని తరలిస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి, అర్లి(బి) గ్రామాల మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. అరవింద్, మరో వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టినట్లు తెలిసింది. ఆ ఇద్దరికి గాయాలు అయినట్లు తెలిసింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా తమ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారని పేర్కొన్నారు.

ఎదురెదురుగా అంబులెన్స్, బైక్ ఢీ



ప్రమాదంలో దెబ్బతిన్న అంబులెన్స్, బైక్

తాంసి: మండలంలోని హస్నాపూర్ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై సోమవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న అంబులెన్స్, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదిలాబాద్‌లోని భాగ్యనగర్ కాలనీకి చెందిన ప్రమోద్ సుంకిడి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. తలమడుగు మండలం లాల్‌ఘూడ గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో హస్నాపూర్ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్, అంబులెన్స్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయపడ్డ ప్రమోద్‌ను స్థానికులు రిమ్స్‌కు, అంబులెన్స్‌లో తరలిస్తున్న వ్యక్తిని వేరే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఆరుగురి బైండోవర్



తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న అధికారులు

కడెం: చెట్లు నరకడం, కలప అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎఫ్‌ఆర్వో చోలే అనిత హెచ్చరించారు. కడెం, ఉడుంపూర్ ఆటవీ రేంజ్‌ల పరిధిలో కలప అక్రమ రవాణా చేస్తుండగా కల్లెడకు చెందిన గొల్ల చంద్రశేఖర్, కుంట మధు, కస్తూరి నరేందర్, బత్తుల వెంకటేశ్, సుధాకర్, సీపెల్లి మహేశ్‌లు ఇటీవల పట్టుబడ్డారు. సోమవారం వారిని ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య ఎదుట బైండోవర్ చేశారు. డీఆర్వోలు సిద్దార్థ, ప్రకాశ్, ఎఫ్‌బీవో ఆలీం, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఉట్నూర్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ ఏపీవో జనరల్ కనక భీంరావ్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 36 అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కనక భీంరావ్ మాట్లాడుతూ ప్రతీ అర్జీని శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని అన్నారు. పీవీటీజీ అధికారి బాస్కర్, డీపీవో ప్రవీణ్, ఓఎస్డీ క్రిష్టయ్య, ఏవో రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- తన కుటుంబ పోషణ, స్వయం ఉపాధి కోసం ఐటీడీఏ ద్వారా ఆర్థిక చేయుత అందించాలని గుడిహత్నూర్ మండలం మచ్చాపూర్‌కు చెందిన నైతం లింబాజీ అర్జీ పెట్టుకున్నాడు.
- గిరి వికాసం పథకం ద్వారా బోరుబావి, విద్యుత్ మోటారు మంజూరు చేయాలని లింగాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన సురేశ్ విన్నవించాడు.
- తన పంట సాగు కోసం ఎడ్ల జత అందించాలని గుడిహత్నూర్ మండలం తోషంకు చెందిన అనసూయబాయి వేడుకుంది.
- తనకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని సిర్పూర్(యూ) మండల కేంద్రానికి చెందిన లింబానాయక్ అర్జీ పెట్టుకున్నాడు.
- పోడుభూములకు అటవీ హక్కు పత్రం అందించాలని కెరమెరి మండలం బాబేఝరికి చెందిన కనక తుకారాం వేడుకున్నాడు.
- తాను బీఎడ్, టెట్ పూర్తి చేశానని, ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీగా ఉద్యోగ అవకాశం కల్పించాలని గాదిగూడ మండలం ఊట్లకు చెందిన రాథోడ్ స్వప్న విన్నవించింది.

బావిలో బాల్ తీయబోయి యువకుడి మృతి



ఆర్యన్ మృతదేహం

ఉట్నూర్‌రూరల్: వ్యవసాయ బావిలో పడిన క్రికెట్ బాల్ తీయబోయి యువకుడి మృతిచెందిన ఘటన మండలంలోని శంకర్‌నాయక్‌తాండలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై సుమన్‌భరత్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడు ఆడే ఆర్యన్ (18) గ్రామ సమీపంలో పిల్లలతో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతున్నాడు. ఆ సమీపంలోని వ్యవసాయ బావిలో బాల్ పడింది. తీయడానికి వెళ్లి ఆర్యన్ జారిపడి పూడికలో కూరుకుపోయి మృతి చెందాడు. కాగా, ఆడే పాండుకు కుమారుడు ఆర్యన్. ఉట్నూర్‌లోని కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. కొడుకు మృతితో కుటుంబ సభ్యుల కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పులుల కదలికలపై నిరంతరం నిఘా



గుంజాల శివారులో అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో బర్నోబా

తాంసి: మహారాష్ట్ర తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చి ఇక్కడ సంచరిస్తున్న పులుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టినట్లు ఎఫ్‌డీవో బర్నోబా తెలిపారు. భీంపూర్ మండలం గుంజాల, గొల్లఘాట్ పరిసరాల శివారు ప్రాంతాల్లో పులులు సంచరిస్తున్న ప్రదేశాలను సోమవారం అటవీశాఖ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం మహారాష్ట్ర వైపు నుంచి పులులు పెన్‌గంగా నది దాటి వచ్చినట్లు భావిస్తున్న స్థలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో మాట్లాడుతూ పులులు ప్రస్తుతం పెన్‌గంగానది పరీవాహక ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పులుల కదలికల కోసం సీసీ కెమెరాలతోపాటు రెండు బేస్ క్యాంప్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్ఎస్వో అహ్మద్‌ఖాన్, ఫ్రేంసింగ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది గులాబ్‌సింగ్, సజ్జన్‌లాల్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, సోనేరావు తదితర సిబ్బంది ఉన్నారు.

సాయన్నకి నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డు



అవార్డు అందజేస్తున్న ఎన్జీవో సంఘం సభ్యులు

నిర్మల్‌ఖైస్‌గేట్: ప్రపంచ ఎన్జీవో దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ప్రగతి ఫౌండేషన్ జాతీయ స్వచ్ఛంద సేవ సంస్థ న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రానికి చెందిన సట్టి సాయన్నకు సోమవారం నేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందజేశారు. ఫౌండేషన్ జాతీయ చైర్మన్ డాక్టర్ ఆరిఫుద్దీన్ మాట్లాడుతూ సామాజిక సేవా రంగంలో విశేష సేవలందిస్తున్న సాయన్న ఈ అవార్డు దక్కడం సంతోషమన్నారు. జాతీయ స్వచ్ఛంద సంస్థ సెలెక్షన్ కమిటీ మెంబర్ ఎలిశెట్టి శ్రీధర్, తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి, నాయకుడు ఏపూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సామగ్రి బయటపడేసిన వారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మసీద్ రూమ్‌లో అద్దెకు ఉంటున్న ఓ వ్యక్తి సామగ్రిని బయటపడేసిన వారిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని సంజయ్‌నగర్‌లోని మసీద్‌కు సంబంధించిన ఓ గదిని గత 27 ఏళ్ల క్రితం మహ్మద్ అబ్దుల్ సలీమ్ రాణా అద్దెకు తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన కుమారుడు న్యాయవాది మహ్మద్ హఫీజ్ రాణా ఆ గదిలో అద్దెకు ఉంటున్నాడు. ఈనెల 23న మసీద్ కమిటీ సభ్యులు, షేక్ ఎజాజ్ పాషా ఆయన సామగ్రిని బయట పడేశారు. దీంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై వివరించారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో నిఖిత సత్తా



జట్టుతో నిఖిత

ఖానాపూర్: పట్టణానికి చెందిన జక్కుల నిఖిత అనే క్రీడాకారిణి అండర్ ఆర్మ్ అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు ఇటీవల భారత జట్టుకు ఎంపికైంది. ఈనెల 24 నుంచి నేపాల్‌లోని పోఖ్రలో పోటీలు జరిగాయి. ×నాలుగో అండర్ ఆర్మ్ ఇండో–నేపాల్ ఇంటర్నేషనల్ కప్ 2023 పోటీలకు జట్టుతో కలిసి పాల్గొని సత్తా చాటింది. దీంతో వీరి జట్టు ప్రథమ స్థానంలో విజయం సాధించడంతో స్థానిక క్రీడా అభిమానాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'సాక్షి' చొరవతో ఆర్థికసాయం

అంతర్జాయ క్రికెట్ పోటీలకు ఎంపికైన నిఖిత పాల్గొనేందుకు ఆర్థిక స్థోమత లేదు. దీంతో ఆమె దీనస్థితిని తెలుసుకున్న 'సాక్షి' గతనెల 23న 'చేయూత కోసం క్రీడాకారిణి ఎదురుచూపు' శీర్షికన ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. పలువురు వేర్వేరుగా రూ.30వేల సాయాన్ని యువతికి అందజేశారు. దీంతో యువతి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంది. తనకు ఆర్థికసాయం అందేలా చొరవ చూపిన 'సాక్షి'కి ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

అదుపు తప్పి కారు బోల్తా

- ఒకరి మృతి, ఐదుగురికి గాయాలు



పులిమడుగు వద్ద బోల్తాపడిన కారు



బన్వర్‌లాల్ మృతదేహం

మామడ: రాజస్తాన్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తుండగా మండలంలోని పులిమడుగు సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా, ఒకరు మృతిచెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మున్నారాం అనే వ్యక్తి కారును వేగంగా నడపడంతో జాతీ య రహదారి మూలమలుపు వద్ద బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న శోభ, గోవింద్, ప్రేమల, లక్ష్మి, శర్వాన్‌కు గాయాలయ్యాయి. నిజామాబాద్‌కు చెందిన బన్వర్ లాల్(38) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజస్థాన్‌కు చెందిన మున్నారాం నిజామాబాద్‌లో వ్యాపారిగా స్థిరపడ్డారు. మున్నారాం వద్ద బన్వర్‌లాల్ కార్పెంటర్‌గా కూలీ పని చేసేవాడు. మృతుడి తమ్ముడు కన్వర్‌లాల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

పథకాల అమలులో తెలంగాణ అగ్రస్థానం

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి



పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న భోజారెడ్డి

ఆదిలాబాద్: సంక్షేమ పథకాల అమలులో దేశంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ విస్తరణ లక్ష్యంగా మహారాష్ట్రలో పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మహారాష్ట్ర విదర్భ ప్రాంతంలోని గన్నారం గ్రామంలో ఏటా వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తుండగా, ఈసారి పోటీల్లో ప్రథమ బహుమతిని ఎమ్మెల్యే జోగు రామన్న అందించనున్నారు. సోమవారం పోటీల ప్రారంభోత్సవానికి పార్టీ తరఫున డీసీసీబీ చైర్మన్ హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా వారిని తీర్చిదిద్దుతున్నామని అన్నారు. డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్, పార్వ ఎస్సై వినోద్, ఘటాంజి ఎంపీపీ రూపేష్ రెడ్డి, సర్పంచ్ చంద్రకళ, ఏఎంసీ డైరెక్టర్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉదయం నుంచి మూసి ఉన్న టిఫా స్కానింగ్ యంత్రం

ప్రభుత్వ చికిత్స.. ప్రైవేటు స్కానింగ్



రాష్ట్ర ప్రభుత్వం వైద్య విభాగంలో మార్పులు చేర్పులు చేస్తోంది. జిల్లా ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పిస్తోంది. కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తెస్తోంది. ఇందులో భాగంగా గర్భిణులకు స్కానింగ్ ఖర్చు తగ్గించేలా ఇటీవలే టిఫా స్కానింగ్ యంత్రాలను ఏర్పాటు చేసింది. అయితే నిర్మల్‌లో యంత్రం అందుబాటులో ఉన్నప్పటికీ రేడియాలజిస్టు ఒక్కడే ఉండడంతో గర్భిణులు టిఫా స్కానింగ్ కోసం నిరీక్షించక తప్పడం లేదు. రేడియాలజిస్టు సెలవుపై వెళ్తే స్కానింగ్ వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. సోమవారం రేడియాలజిస్టు అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి వైద్యురాలు పరీక్షలు చేసి ప్రైవేటుగా టిఫా స్కానింగ్ చేసుకోవాలని సూచించింది. దీంతో చేసేదిలేక సదరు మహిళ ప్రైవేటుగా రూ.2 వేలు ఖర్చు చేసి స్కానింగ్ చేసుకుని రిపోర్టు తీసుకుని తిరిగి ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. - సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్